
ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

నేనూ - శోభన్‌బాబు

- వాణిశ్రీ

1973 నవంబర్ చలనచిత్ర



ఒకరోజు మొట్టమొదటిసారిగా కలుసుకున్నప్పుడు నమస్కారం అనో లేక నమస్తే అనో, కాస్త స్టయిల్‌గా అనాలనుకుంటే గుడ్‌మార్నింగ్ అనో, మరీ అధునాతనంగా అనాలనుకుంటే 'హాయ్' అనో ప్రారంభమవుతాయి పలకరింపులు. ఈ నమస్కారాలతో చిక్కేమిటంటే మనం పెట్టినపుడు ఎదుటివారు చూడక వేస్ట్ అయితే చాలా యిబ్బందిగా వుంటుంది. ఒక్కొక్కప్పుడు నమస్కారం పెట్టేది ఒకరికయితే మరొకరు "రిసీవ్" చేసుకుంటుంటారు. అప్పుడయితే మరీ ఒళ్ళు మండిపోతుంది. షూటింగ్ ప్రారంభమయిన మొదటిరోజు ప్రొద్దున్నే సెట్‌కు వెళ్ళగానే ఈ నమస్కారాల కోలాహలం బలే జోరుగా వుంటుంది. ఒకరినొకరు పరామర్శించుకోవటాలు, అందులో కొంచెం వ్యంగ్యం, కొంత కోపం, మరికొంత అసూయ, ఒక్కోసారి నిజమైన ఆప్యాయతా అన్ని రసాలూ మిళితమై నవరస ప్రపంచంలా వుంటుంది. రెండోరోజు యింత ఉధృతముండదు.

నా ఫ్రెండ్స్ కొంతమంది నన్నడుగుతూ వుంటారు. సినిమాల్లో ఇంత మంది హీరోలతో నటిస్తూ వుంటావు కదా, విడిగా వారు నీతో ఎలా మాట్లాడతారు, మొట్టమొదటిసారి సెట్‌కు వెళ్ళగానే నువ్వెలా పలకరిస్తావు, ఫలానా ఆయన

మాట్లాడటకదా! అన్నట్టు యితను చాలా కోపిష్టి అటనే. ఆయన మరీ స్టయిల్ చేస్తాడటగా! అసలు నిజమేమిటో చెప్పమని ఇలాంటి ప్రశ్నలతో నన్ను ఊపేస్తూ ఉంటారు. ఈ ప్రశ్నలు వింటుంటే నాకు నవ్వాగదు. ఎందుకంటారా డైరెక్టర్ ఆదేశానుసారం నవ్వమంటే నవ్వి, ఏడవమంటే ఏడ్చి, కోపగించుకోమంటే కోపగించుకుని ఆ సన్నివేశాలకు తగ్గట్టు నటిస్తానే తప్ప అందులో యిష్టాయిషాలతో పనేముంటుంది? నేనెవరికైనా యిచ్చే సమాధానం యిదే. కాని వాళ్ళు దానితో నన్ను వదలరు. అసలెలా మాట్లాడతావో సరదాగా చెప్పు అంటుంటారు. కొందరు అభిమానులు మీకెవరంటే యిష్టమో చెప్పమని ఉత్తరాలు కూడా వ్రాస్తుంటారు. అలా తెలుసుకోవాలని కుతుహలం కలవారి కోసమే యిది వ్రాస్తున్నాను.

అరె! యిదేమిటి? శోభన్‌బాబు గురించి ముందు వ్రాస్తున్నారు. ఆయనంటే మీకు అభిమానమా? అని అనుకునేరు. అదేం లేదు. నా దృష్టిలో అందరూ ఒక్కటే. ఎవరికి ఇవ్వవలసిన గౌరవం వారికి ఇస్తాను. మరి యీయన గురించి ఎందుకు చెబుతున్నానంటే హీరో, హీరోయిన్స్‌గా వెయ్యకముందునుంచి అంటే చిన్న చిన్న వేషాలు వెయ్యటం దగ్గరనుండి బాగా చనువు పరిచయం వుంది. శోభన్‌బాబులో అప్పటికి యిప్పటికి చాలా మార్పు కనిపిస్తుంది. విగ్రహంలో నిండుతనం, మాటలో హుందాతనం, నటనలో అప్పటికంటే మెచ్యూరిటీ కనిపిస్తుంది. మనసు మాత్రం అలాగే వుంది. మనిషికి కావలసింది అదే. మనిషి మారినా మనసు మారకూడదు. శోభన్ నుంచి నేను తీసుకునే సందేశం అదే. మేమిద్దరం సెట్‌లో మొదటిసారిగా కలిసినపుడు శోభన్‌బాబే ముందు పలకరిస్తాడు. అదెలా వుంటుందో తెలుసా?

"గుడ్ మార్నింగ్ యంగ్ లేడీ" అంటారు.

నేను నవ్వుతూనే "అదేమిటండీ, యంగ్‌లేడీ ఏమిటీ యంగ్ గర్ల్ అని పిలవకూడదూ" అని నేనంటే

"అబ్బా! చిన్నపాప! పెళ్ళయివుంటే యీపాటికి యిద్దరు బిడ్డల తల్లయి వుండేదానివి" అనంటారు.

"యింకా నయం డజను అన్నారు కాదు" అని నేనూ నవ్వేస్తూవుంటాను. నవ్వుతూ ఆయన మా అమ్మగారితో "పెద్దమ్మా! ఎలా కన్నావమ్మా నీ కూతుర్ని. మా ప్రాణాలు తీసేస్తుంది. మేం చచ్చిపోతున్నాం అనుకో, అబ్బబ్బ! సినిమాల్లోనూ గొడవే, బయటా గొడవే."

ఈ మాటలు వింటూ కూర్చున్న మిగతావాళ్ళు కూడా నవ్వేస్తూవుంటారు. శోభన్‌బాబుని నేను 'బన్‌బాబు' అని పిలుస్తూవుండేదాన్ని. ఈ మధ్య మానేశాను. ఒకవేళ మర్చిపోయి ఎప్పుడైనా పిలిస్తే ప్రక్కనున్న కర్రో, చిన్న రాయో తీసుకుని తరుముతారు.

"అదేమిటండీ మీరు స్వంత కుర్చీ తెచ్చుకోరు, మంచినీళ్ళు తెచ్చుకోరు, స్టూడియో కుర్చీలో కూర్చుని హీరోయిన్ తెచ్చుకున్న మంచినీళ్ళు తాగేస్తూవుంటారు" అని ఆట పట్టిస్తూ వుండేదాన్ని.

ఒకరోజు శోభన్‌బాబు "వాణీ చాలా మంచివార్త" అన్నారు.

ఏమై వుంటుందా అని ఆలోచించాను. నాకేమీ తోచలేదు. తనే స్వయంగా వెళ్ళి ఒక కుర్చీ తెచ్చి వేశారు. "ఏమిటండోయ్ చాలా మర్యాదచేస్తున్నారు. యింతకీ ఆ శుభవార్త ఏమిటో చెప్పండి" అన్నాను.

దానికి ఆయన సీరియస్‌గా మొఖం పెట్టి "మరేం లేదు. మొన్న స్పెన్సర్స్‌కు వెళ్ళాను. అక్కడ ఒక మంచి ఛైర్ కనిపించింది. కొనేశాను. యివ్వాళ నీకు చూపించాలని సెట్‌కు తీసుకువచ్చాను. ముందుగా నువ్వే కూర్చోవాలి. కూర్చో" అంటూ కూర్చోబెట్టి వాళ్ళ అసిస్టెంటును పిలిచి అతనితో ఆయన ఫ్లాస్క్ లోంచి నీళ్ళు ఓ గ్లాసుడు పోయించి నాచేతికిస్తూ "తాగు మహాతల్లీ! యిన్నాళ్ళూ ఎగతాళి చేశావుగా. యిక నీకు ఛాన్స్ లేదు. కుర్చీ కొన్నాను, ఫ్లాస్కు కొన్నాను" అని గర్వంగా నావైపు చూస్తూ ఆ మంచి నీళ్ళు తాగిందాకా వదల్లేదు. శోభన్‌బాబుగారికన్నా ఆయన కుర్చీ, ఫ్లాస్కు చూసినప్పుడల్లా యీ సంఘటన జ్ఞాపకం వచ్చి నవ్వు ఆపుకోలేక చచ్చిపోతాను.

బి.యన్.రెడ్డిగారి దర్శకత్వంలో బంగారు పంజరంలో నేను శోభన్ కలిసి పనిచేసేటప్పుడు ఒకరోజు ఏమైందంటే బి.యన్.గారు రషెస్ చూసి వచ్చారని తెలిసి ఎలా వుందండీ అనడిగాను.

"బాగానే వుంది కాని శోభన్‌బాబులోనే ఓ లోపం కనిపిస్తుంది" అన్నారు.

ఏమిటండీ అనడిగాను.

"ఆ సంగతి శోభన్‌బాబుకు నేను చెప్పాను. ఈ పాటికి అంతా సర్దుబాటు అయ్యుటుంది" అన్నారు. అసలు నాకేం అర్థంకాలేదు. కాస్సేపు ఆలోచించాను. మేకప్‌లో ఏమన్నా ఛేంజెస్ చెప్పారేమోననుకుని ఊరుకున్నాను.

ఆ షెడ్యూలు అయ్యాక రషస్ చూడటానికి ఒకసారి రమ్మని కబురు బి.యన్.గారు. రషెస్ చూసిన తరువాత శోభన్‌లో ఏమైనా మార్పు తెలుస్తుందా అనడిగారు. నాకేం తెలియలేదు. ఆయన్నే అడుగుదామనుకునే సరికి ఎవరో ఆయనతో, మాట్లాడ్డానికి వచ్చారు. మెల్లగా శోభన్‌బాబునే అడిగాను ఏమిటండీ మార్పు అని. 'చూయింగ్ గమ్' నవుతులూ "ఏమిటో చెప్పుచూద్దాం" అంటూ నవ్వారు.

"అదేమిటి ఎప్పుడులేని అలవాటు చూయింగ్ గమ్ నవలటం మొదలు పెట్టారేమిటి?" అడిగాను.

"అదే బుజ్జితల్లి దాన్నిబట్టే ఆలోచించు ఆ మార్పేమిటో" అన్నారు.

ఎవరైనా ఒక విషయాన్ని గురించి సస్పెన్సులో పెడితే నాకు చాలా కోపం వస్తుంది. తెలుసుకోవాలన్న క్యూరియాసిటీ ఒకవైపు, చెప్పలేదన్న కోపం మరోవైపు, "సరే మీరు చెప్పేదాకా దాన్ని గురించి అసలు ఆలోచించ"నని గట్టిగా సమాధానం చెప్పాను.

తరువాత బి.యన్. గారే చెప్పారు. శోభన్‌బాబు రెండుపళ్ళ మధ్య సందువుందని నవ్వుతున్నప్పుడు వెల్తిగా కనబడుతుందని దాన్ని డెంటిస్ట్ సలహాతో కవర్ చెయ్యాలని చెప్పారట. వెంటనే శోభన్‌బాబు ఆ పని చేశారట. కాసేపు బి.యన్.గారు శోభన్‌బాబు సిన్సియారిటీని పొగిడేశారు .బాగా వృద్ధిలోకి వస్తాడని, చాలా బుద్ధిమంతుడని, పెద్దలమాట

వింటాడని యిలా చాలాసేపు మాట్లాడుతూనే వున్నారు. నేను వారి మాటలు వింటూనే శోభన్‌బాబుని ఒక కంట కనిపెడుతూనే వున్నాను. మాష్టారు తొమ్మిదో ఎక్కం చెప్పమంటే ఎక్కం రాని విద్యార్థి బిక్క మొహం వేసి చేతులు కట్టుకుని నిలబడ్డట్టు శోభన్‌బాబు నిలబడ్డారు. ఇదేమిటి పన్ను ఎప్పుడు కవర్ చేశారు. ఇందాక నవ్వినప్పుడు మామూలుగానే వుందే, ఏమిటి చెప్మా? అని ఆలోచనలో పడ్డాను. శోభన్ నావైపు చూడటమే లేదు. చూస్తే ఎక్కడ నవ్వవలసి వస్తుందో అని వచ్చే నవ్వును ఆపుకుంటూ బుద్ధిమంతుడిలా తలవంచుకుని నిలబడ్డారు. నాకప్పుడే అర్థమయింది. ఇందులో ఏదో కిటుకు వుందని. ఆ చిత్రంలోనే ఒకపాట చిత్రీకరణకోసం ఏర్కాడు వెళ్ళవలసి వచ్చింది. నేను లొకేషన్‌కు వెళ్ళేటప్పటికి బి.యన్.గారు శోభన్‌బాబుకు ఏవో సలహాలు యిస్తున్నారు. షాట్ చిత్రీకరణ ప్రారంభమయింది. నేను పాటపాడుకుంటూ శోభన్‌బాబు దగ్గరకు వెళ్ళాలి. ఆయన చిరునవ్వుతో నావైపు చూడాలి, కాని శోభన్‌బాబుకు యిక్కడ నవ్వక తప్పలేదు. పళ్ళమధ్య ఎర్రగా కనిపించింది. "అదేమిటి శోభన్‌బాబుగారూ మీ పళ్ళు ఎర్రగా వున్నాయి" అని అన్నాను. దానికి ఆయన కంగారు పడుతూ "గట్టిగా మాట్లాడకు బి.యన్.గారు వింటారు. మళ్ళీ ఎవరితోనూ చెప్పకు. నీకు నిజం చెబుతున్నాను. నేను పన్ను కట్టించుకోలేదు, నేను ఛూయింగ్ గమ్ అలవాటు చేసుకున్నది దానికోసమే. నేను నిజంగానే డెంటిస్టు దగ్గరకు వెళ్ళాను. వాళ్ళు పళ్ళమధ్య డ్రిల్లింగ్ చెయ్యాలని ఏదో అన్నారు. భయమేసి పరిగెత్తుకొచ్చాను. ఏం చెయ్యటమా అని ఆలోచిస్తే యీ అయిడియా తట్టింది. మద్రాసులో అయితే తెల్ల ఛూయింగ్ గమ్ దొరికేది. యీ వూళ్ళో పింక్ కలర్ ఛూయింగ్ గమ్ దొరికింది. అందుకే యివ్వాళ పన్ను కలర్ మారింది"

ఇక నేను నవ్వాపుకోలేకపోయాను. ఇంతలో బి.యన్.గారు ఏమిటమ్మా అంటూ మా దగ్గరకి వచ్చారు. పాపం అప్పుడు శోభన్‌బాబు అవస్థ అంతా యింతా కాదు. ఈ లోపల లైట్ వచ్చింది షాట్ రెడీ అన్నారెవరో ఈ విషయం అనుకున్నప్పుడల్లా నాకు తెగ నవ్వొస్తుంది.

మనిషికి పేరు వచ్చేవరకే అన్ని లోపాలు కనిపిస్తాయి. పేరు ప్రఖ్యాతులు వస్తే పెద్ద పెద్ద లోపాలు కూడా కవర్ అయిపోతాయి. అయినా శోభన్‌కి ఆ పన్ను సందు పెద్ద లోపం ఏమీకాదు, అదే అందం అనిపిస్తుంది యిప్పుడు. ఈసారి ఏదైనా సినిమాలో బాగా గమనించి చూడండి మీకే తెలుస్తుంది.

ఇలా చెప్పుకుంటూ పోతే చాలా వుంది. అయినా శోభన్‌బాబులో నాకు నచ్చే గుణాలు ఏమిటంటే పట్టుదల, సిన్సియారిటీ.

Post your comments